గుట్టలో వైభవంగా అష్టోత్తర శతఘటాభిషేకం

గిరి ప్రదక్షిణలో ప్రభుత్వ విప్ ఐలయ్య

యాదగిరిగుట్ట, నవంబర్ 29 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంతోపాటు అనుబంధ పాతగుట్ట (పూర్వగిరి) ఆలయంలో శుక్రవారం స్వాతినక్షత్ర పూజలు ఘనంగా జరిగాయి. స్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా వైభవంగా అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు. ప్రధానాలయ ముఖ మండపంలో 108 కలశాలను ఏర్పాటు చేసి గంగాది, సప్తనదీ జలాలు, మామిడి, తమలపాకులు, దర్భలు, పూలమాలలు, కొబ్బరికాయలతో అలంకరించారు. పంచామృతాలతోపాటు సుగంధ ద్రవ్యాలతో స్వామివారిని అభిషేకించారు. ఆయా దేవతల మూలమంత్ర పఠనాలతో హోమ పూజలు నిర్వహించారు. ప్రధానాలయంలో కొలువుదీరిన స్వయంభూ పంచనారసింహస్వామి, సువర్ణ ప్రతిష్ఠా అలంకార మూర్తులను వేదమంత్రాలతో అష్టోత్తర శతఘటాభిషేక పూజలు నిర్వహించి సువర్ణపుష్పాలతో అర్చించారు. సాయంత్రం స్వాతి జన్మనక్షత్రం సందర్భంగా స్వామివారిని దివ్య మనోహరంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. తెల్లవారుజాము నుంచే భక్తులు గిరిప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి, అమ్మవార్లకు సహస్రనామార్చన, వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, కల్యాణోత్సవ సేవ, నిత్య తిరు కల్యాణ తంతును జరిపారు. సాయంత్రం స్వామివారిని గరుఢ వాహనంపై, అమ్మవారిని తిరుచ్చి సేవపై వేంచేపు చేసి జోడు సేవను తిరువీధుల్లో ఊరేగించారు. రాత్రి స్వామివారి తిరువారాధన, సహస్రనామార్చన, శయనోత్సవ సేవను శాస్త్రోక్తంగా జరిపారు. ప్రధానాలయంలో ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. మాస శివరాత్రి సందర్భంగా అనుబంధ పర్వతవర్ధనీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో 108 దక్షణావ్రత శంఖాలతో స్ఫటిక లింగేశ్వరుడికి రుద్రాభిషేకం నిర్వహించారు. కార్తిక మాసం సందర్భంగా శివాలయంలో ఆకాశ దీపారాధన నిర్వహించారు. స్వామివారి ఖజానాకు రూ.39,94,950 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

సామూహిక గిరి ప్రదక్షిణ

స్వామివారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రంలో భాగంగా దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే సామూహిక గిరిప్రదక్షిణలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. తెల్లవారుజామున స్వామివారి వైకుంఠ ద్వారం వద్ద ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావుతో కలిసి పూజలు నిర్వహించి గిరి ప్రదక్షిణను ప్రారంభించారు. కొండ చుట్టూ పాదయాత్ర చేశారు. కొండ కింద వైకుంఠ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన సంగీత, సాహిత్య వేదికపై పలువురు కళాకారుల నృత్యాలు, నాట్యాలు భక్తులను అలరించాయి.

శివాలయంలో ఆకాశ దీపారాధన

పర్వతవర్ధనీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తిక మాసంతోపాటు మాస శివరాత్రి సందర్భంగా ఆకాశ దీపారాధన జరిగింది. ఆలయంలో గణపతి హోమం నిర్వహించిన అనంతరం ధ్వజస్తంభానికి ఆకాశ దీపాన్ని వెలిగించారు. ఆలయంలో శివుడి, శివలింగం వేసి దీపాలతో అలంకరించారు.

కొండపైన కోతుల పట్టివేత

కొండపైన కోతుల బెడద నివారణకు దేవస్థాన అధికారులు చర్యలు చేపట్టారు. ఆటవీ శాఖ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంతాల్లో అధిక సంఖ్యలో కోతులు తిరుగుతున్న ప్రాంతంలో బోనుల్లు ఉంచారు. అందులో తినుబండారాలు వేసి కోతులు రాగానే బంధించి గజ్వేల్ ప్రాంతంలోని ఆటవీ ప్రాంతంలో వదిలారు. శుక్రవారం ఒక్కరోజే సుమారు 100 కోతులను బంధించి ఆటవీ ప్రాంతంలో వదిలివేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

స్టాండ్ లేక నేలపైనే..

కొండపైన మాడవీధుల్లోని ఈశాన్య ప్రాంతంలో గల అఖండ దీపారాధన ప్రాంతంలో కొబ్బరికాయ కొట్టు స్థలాన్ని దేవస్థానం ఏర్పాటు చేసింది. ఇందుకోసం కొబ్బరి కాయలను కొట్టేందుకు ప్రత్యేకమైన స్టాండ్‌ను ఏర్పాటు చేసింది. కానీ... శుక్రవారం ఆ స్టాండ్ లేకపోవడంతో భక్తులు కింద దిమ్మెలకు కొట్టాల్సి వచ్చింది. కొబ్బరికాయ కొట్టే ప్రాంతంలో స్టాండ్ మాయం కావడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు.

ఆలయ తోటలో కార్తిక వన భోజనాలు

యాదగిరిగుట్ట, నవంబర్ 29 : దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్తిక వన భోజనం కమనీయంగా సాగింది. మల్లాపురం గ్రామ పరిధిలోని ఆలయ తోటలో మొదటగా గణపతి పూజ, స్వస్తీవాచనం, ఆదిత్యాదినవగ్రహారాధన, మండపారాధన, సత్యనారాయణ స్వామి పూజ, తులసీదాత్రి సమేత కార్తిక దామోదరస్వామి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిపారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, వనభోజనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు దంపతులు, డీఈఓ దోర్బాల భాస్కర్ శర్మ, ఏఈఓ గజవెల్లి రమేశ్‌బాబు, రఘు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఉర్సు : భిక్షమయ్యగౌడ్

గంధం ఊరేగింపులో మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్య గౌడ్, ముస్లిం మత పెద్దలు

ఆలేరు టౌన్, నవంబర్ 29 : ఉర్సు మత సామరస్యానికి ప్రతీక అని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బూడిద భిక్షమయ్య గౌడ్ అన్నారు. ఆలేరు పట్టణంలోని జిందాషా మదార్ సాహెబ్ దర్గా ఉర్సు ఉత్సవాల సందర్భంగా శుక్రవారం గంధం ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని జిందాషా మదార్ సాహెబ్‌ను వేడుకున్నామన్నారు. గంధం ఊరేగింపులో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేశం గౌడ్, నాయకులు సారాబు సంతోష్, ఎండీ ఫయాజ్, పవన్, మత పెద్దలు, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా శివభక్త మార్కండేయస్వామి కల్యాణం

ఆలయంలో రుద్ర హోమం చేస్తున్న భక్తులు

చౌటుప్పల్, నవంబర్ 29 : పట్టణంలోని శివభక్త మార్కండేయస్వామి దేవాలయంలో శుక్రవారం పార్వతీ పరమేశ్వరస్వామి 5వ వార్షిక కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గణపతి పూజ, స్వస్తీ వాచనం, ధ్వజారోహణం, రుద్రహోమం చేపట్టారు. ఆలయంలో పూజలు చేసిన అనంతరం తీర్థ ప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గోశిక నర్సింహ, నాయకులు గంజి వెంకటేశం, బడుగు నర్సింహ, భావనారుషి, హరికృష్ణ, రాజు, పూర్ణచందర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ గుట్ట డిపోలో కార్తిక వనభోజనాలు

యాదగిరిగుట్ట డిపోలో వన భోజనాలు చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

యాదగిరిగుట్ట, నవంబర్ 29 : టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ సూచనల మేరకు యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపోలో శుక్రవారం కార్తిక వనభోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిపోలో విధులు నిర్వర్తించే ఉద్యోగులు డిపో ఆవరణలో వన భోజనాలు ఏర్పాటు చేశారు. క్రీడా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీనివాస్, అసిస్టెంట్ డిపో మేనేజర్ ప్రవీణ్‌కుమార్, గ్యారేజీ ఇన్‌చార్జి హనుమానాయక్, మత్యాలు, మనోజ్‌కుమార్, జాకబ్, శ్రీనివాస్, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

దీక్షా దివస్‌కు తరలిన గులాబీ సైన్యం

యాదగిరిగుట్ట, నవంబర్ 29 : జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్‌రామ్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన దీక్షా దివస్‌కు జిల్లా నలుమూలల నుంచి గులాబీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఆలేరు పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, ఇతర నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా జిల్లా కేంద్రానికి వెళ్లారు. కార్యక్రమంలో నాయకులు గడ్డమీది రవీందర్‌గౌడ్, మిట్ట వెంకటయ్య, పాపట్ల నరహరి, బాలరాజుగౌడ్, పేరబోయిన సత్యనారాయణ, ఆరె శ్రీధర్‌గౌడ్, సతీశ్, సాయి, నర్సింహ, నర్సింహారెడ్డి, యాకూబ్, చంద్రం, వాసు, వీరేశం, రాజు, బాబా, క్రాంతి పాల్గొన్నారు.

రాజాపేట : భువనగిరిలో జరిగే దీక్షా దివస్‌కు బీఆర్ఎస్ మండల నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా రాజాపేటలో ప్రదర్శన నిర్వహించారు. తరలిన వారిలో నాయకులు సట్టు తిరుమలేశ్, గుంటి మధుసూదన్ రెడ్డి, సందిల భాస్కర్ గౌడ్, గుంటి కృష్ణ, వెంకటేశ్‌గౌడ్, ధర్మేందర్ సింగ్, కరుణాకర్ రెడ్డి, జశ్వంత్, కరీం, వీరేశం ఉన్నారు.

ఆత్మకూరు(ఎం) : దీక్షా దివస్‌కు మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు వందలాదిగా తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్, సెక్రటరీ జనరల్ పంజాల వెంకటేశ్‌గౌడ్, నాయకులు రంగా రెడ్డి, ఇంద్రారెడ్డి, భిక్షపతి, రమేశ్‌గౌడ్, వెంకన్న, అరుణ, శంతన్‌రాజు, రాంబాబు, ఉపేందర్‌రెడ్డి, లింగయ్య, వెంకటేశ్ ఉన్నారు.

రామన్నపేట : దీక్ష దివస్ కార్యక్రమంలో పాల్గొనేందుకు మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోశబోయిన మల్లేశ్, నాయకులు బందెల రాములు, కంభంపాటి శ్రీనివాస్, బొక్క మాధవరెడ్డి, కన్నెబోయిన బలరాం, సాల్వేరు అశోక్, మిర్యాల మల్లేశం, పున్న వెంకటేశం, రేఖ యాదయ్య, ఎస్‌కే చాంద్, రామిని లక్ష్మణ్, లవణం రాము తదితరులు దీక్షా దివస్‌కు వెళ్లారు.

ఆలేరు టౌన్ : భువనగిరిలో జరిగిన దిక్షా దివస్‌కు ఆలేరు నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. దిక్షా దివస్‌లో ఆలేరు మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య మాట్లాడారు. జిల్లాకు తరలిన వారిలో నాయకులు పుట్ట మల్లేశం గౌడ్, మొరిగాడి వెంకటేశ్‌గౌడ్, పత్తి వెంకటేశం, ఆడెపు బాలస్వామి, నాయకులు ఉన్నారు.

గుండాల : బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎండీ ఖలీల్ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు దీక్షా దివస్‌కు వెళ్లారు. వెళ్లిన వారిలో బీఆర్ఎస్ నాయకులు మహేశ్వరం మహేందర్‌రెడ్డి, మూగల శ్రీనివాస్, పొన్నగాని మహేశ్, నాయకులు రాములు, మల్లారెడ్డి, నాగరాజు, సోమన్న, రామ్మూర్తి ఉన్నారు.


భువనగిరిలో జరిగిన దీక్షా దివస్‌లో డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డితో బీఆర్ఎస్ గుండాల మండల నాయకులు

యాదగిరిగుట్టలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దీక్ష దివస్‌కు వెళ్లిన బీఆర్ఎస్ రామన్నపేట మండల నాయకులు

రాజాపేట నుంచి దీక్షా దివస్‌కు తరలుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఆత్మకూరు(ఎం) : దీక్షా దివస్‌లో బీఆర్ఎస్ నాయకులు

విద్యార్థులకు సురక్షిత ఆహారం అందించాలి

● కలెక్టర్ హనుమంతరావు

అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి అర్బన్, నవంబర్ 29 : ఆరోగ్యకరమైన జీవన శైలిని ప్రోత్సహిస్తూ ప్రభుత్వ హాస్టళ్లలోని విద్యార్థులకు సురక్షితమైన ఆహారం అందించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ఆధ్వర్యంలో పైలెట్ ప్రాజెక్టుగా గురుకుల పాఠశాలలు, హాస్టళ్ల వార్డెన్లకు, వంటచేసే సిబ్బంది, సహాయ సిబ్బందికి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు చాగంటి ఆంజనేయులు, వివేక్ శుక్రవారం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లోని విద్యార్థులకు అందించే ఆహారం శుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉండాలన్నారు. ఈ విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. శిక్షకులు చెప్పే విషయాలను శ్రద్ధగా పాటించాలన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు చాగంటి ఆంజనేయులు, వివేక్ మాట్లాడుతూ వంట చేయడానికి సేకరించే కూరగాయలు, ఆకుకూరలు, నూనె, పిండి, పప్పులు శుభ్రమైనవిగా, ఆరోగ్యకరమైనవిగా, ఎఫ్ఎస్ఎస్ఎఐ గుర్తింపు ఉండేటట్లు చూసుకోవాలన్నారు. గడువు తేదీని, నాణ్యత లోపం లేకుండా చూడాలని సూచించారు. వంట సామగ్రి, వంట గది, భోజనశాల శుభ్రంగా ఉండాలని, ఈగలు, దోమలు, ఎలుకలు, బొద్దింకలు లేకుండా జాగ్రత్తగా ఉంచుకోవాలని అన్నారు. వంట చేసే సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని, తలకు వస్త్రం ధరించాలని సూచించారు. అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, గంగాధర్, డీఎంహెచ్ఓ మనోహర్, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి, ఫుడ్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ ఆఫీసర్ డాక్టర్ ఎం.సుమన్ కళ్యాణ్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ స్వాతి పాల్గొన్నారు.

డయాలసిస్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేటలో డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేట, నవంబర్ 29 : ప్రభుత్వ దవాఖానలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత డయాలసిస్ సెంటర్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో 85మందికి సీఎం సహాయనిధి చెక్కులను, నలుగురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులు డయాలసిస్ చేయించుకునేందుకు దూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం 4 జనరల్ బెడ్లతోపాటు ఒక ఇంటెన్సివ్ కేర్ బెడ్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ చిన్నానాయక్, తాసీల్దార్ లాల్‌బహదూర్, ఎంపీడీఓ యాకూబ్ నాయక్, ప్రాజెక్టు మేనేజర్ అబ్దుల్ ఖాదర్, జనరల్ మేనేజర్ శివకుమార్‌శెట్టి, వైద్యులు ఈశ్వర్, బి.వీరన్న, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సిరిగిరెడ్డి మల్లారెడ్డి పాల్గొన్నారు.

దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్

విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి అర్బన్, నవంబర్ 29 : విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. పట్టణంలోని 10 ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 50 మంది బాలికలకు భువనగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా సైకిళ్లను అందజేశారు. వాటిని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం విద్యార్థినులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ దాతల సహకారంతో విద్యార్థుల ఇబ్బందులు కొంతవరకు తొలగిపోతాయన్నారు. విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేసిన క్లబ్ సభ్యులను అభినందించారు. సభ్యులు నర్సింహారావు, శరత్‌బాబు, వెంకట్‌రెడ్డి, దేవేంద్రచారి, బాలయ్య, కళాశాల ప్రిన్సిపాల్ పాపిరెడ్డి పాల్గొన్నారు.

నేడు రైతు పండుగ

భువనగిరి అర్బన్, నవంబర్ 29 : రాష్ట్ర ప్రభుత్వం శనివారం రైతు పండుగ నిర్వహిస్తుందని, ఇందులో రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు ప్రదర్శనలు, శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారని కలెక్టర్ హనుమంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లాలోని ఒక్కొక్క రైతు వేదికలో వంద మంది రైతులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించేందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. రైతులు సమీప రైతు వేదికల్లో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సూచించారు.

వ్యాసెక్టమీ ఆపరేషన్లపై అవగాహన కల్పించాలి

● జిల్లా వైద్యాధికారి డాక్టర్ మనోహర్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ మనోహర్

భువనగిరి అర్బన్, నవంబర్ 29 : జిల్లాలో వ్యాసెక్టమీ ఆపరేషన్లు తగ్గుతున్నాయని, దానిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మనోహర్ అన్నారు. వ్యాసెక్టమీ పక్షోత్సవాల సందర్భంగా పట్టణంలోని వెటర్నరీ దవాఖానలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో వ్యాసెక్టమీ ఆపరేషన్లు తగ్గాయని, ఏడాదికి ఒకటి, రెండు కూడా కావట్లేదని అన్నారు. వ్యాసెక్టమీపై అవగాహన కల్పించేందుకు డిసెంబర్ 4నుంచి జనవరి 4కు వరకు పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకునేందుకు పురుషులు సుముఖత చూపకపోవడంతో ట్యూబెక్టమీ ఆపరేషన్లు పెరుగుతున్నాయన్నారు. డిసెంబర్ 3, 4 తేదీల్లో భువనగిరి జిల్లా దవాఖాన, చౌటుప్పల్ పీహెచ్‌సీలో వ్యాసెక్టమీ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ యశోద, డాక్టర్లు వీణ, రామకృష్ణారావు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ఆత్మకూరు(ఎం), నవంబర్ 29 : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో తాసీల్దార్ రవికుమార్ శుక్రవారం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందిస్తూ పరిశుభ్రతను పాటించాలన్నారు. ఆయన వెంట ఎంఈఓ మహదేవరెడ్డి, ఆర్ఐ మల్లికార్జున్‌రావు ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించేందుకు చర్యలు

● అదనపు కలెక్టర్ వీరారెడ్డి ● మోత్కూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల సందర్శన

మోత్కూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వంట ఏజెన్సీ నిర్వాహకురాలితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

మోత్కూరు, నవంబర్ 29 : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి నాణ్యమైన బియ్యం సరఫరాకు చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. 'ముద్దల అన్నం తినేదెలా' శీర్షికతో నమస్తే తెలంగాణలో ప్రచురితమైన వార్తకు స్పందించిన ఆయన శుక్రవారం మోత్కూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. బియ్యం, వంట చేసే పరిసరాలను పరిశీలించారు. వంట ఏజెన్సీ నిర్వాహకురాలితో మాట్లాడి వంట చేసే విధానంపై సూచనలు చేశారు. సివిల్ సప్లయ్ గోడౌన్‌లో బియ్యాన్ని పరిశీలించారు. గురుకుల, కేజీబీవీ, జడ్పీ పాఠశాలలకు నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని డీటీ లాయక్ అలీని ఆదేశించారు. కొత్త బియ్యం కావడంతో అన్నం ముద్దగా అవుతుందని, నిజామాబాద్ నుంచి వచ్చే సన్న బియ్యం సాధారణ క్వాలిటీగా ఉంటున్నాయని తెలిపారు. ఇక ముందు ఇలాంటి సమస్యలు చోటుచేసుకోకుండా చూడాలని, మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఆదేశించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. మధ్యాహ్నం సమయంలో సివిల్ సప్లయ్ డీఎం జగదీశ్, మండల ప్రత్యేకాధికారి యాదయ్య, తాసీల్దార్ రాంప్రసాద్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

ధరణి సమస్యల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్ : అదనపు కలెక్టర్

మోత్కూరు, నవంబర్ 29 : ధరణి సమస్యల పరిష్కారానికి నెల రోజులుగా స్పెషల్ డ్రైవ్ చేస్తున్నామని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. తాసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేసి రికార్డులు భద్రపరిచే గదిని పరిశీలించారు. ఫైళ్లు భద్రపర్చడం అధ్వాన్నంగా ఉందన్నారు. అనంతరం అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ధరణి రిజిస్ట్రేషన్లు, మీ సేవ సర్టిఫికెట్ల జారీపై అడిగారు. దాదాపు 100 సర్టిఫికెట్లు పెండింగ్‌లో ఉండగా.. ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలను రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా సర్టిఫికెట్లను వెంటనే జారీ చేయాలన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రేషన్ సరుకుల పంపిణీ సమయంలో గ్రామాల్లోని రేషన్ షాపులను తాసీల్దార్, ఆర్ఐలు తనిఖీ చేయాలన్నారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలను పంపిస్తామని చెప్పారు అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. జిల్లాలో ధరణిలో 2వేల సమస్యలు విచారణ దశలో ఉన్నాయని, వారం రోజుల్లో వాటన్నింటినీ పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. జిల్లాలో 372 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఇప్పటి వరకు లక్షా 90వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. 2వేల టన్నుల సన్న ధాన్యం కొనుగోలు చేసి రైతులకు రూ.500 బోనస్ కూడా చెల్లించామన్నారు. మండల ప్రత్యేకాధికారి యాదయ్య, తాసీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీఓ బాలాజీ పాల్గొన్నారు.

పాముకాటుతో విద్యార్థి మృతి

యాదగిరిగుట్ట, నవంబర్ 29 : మండలంలోని మహబూబ్‌పేట గ్రామంలో పాముకాటుతో యువకుడు మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన గాజుల మనీశ్ అలియాస్ నానీ (17) భువనగిరిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఫస్టియర్ చదువుతున్నాడు. గురువారం రాత్రి ఇంట్లో నేలపై నిద్రపోయాడు. నిద్రలో ఉండి పక్కనే ఉన్న బియ్యం బస్తాల వైపు చేతిని వేయగా బస్తాల కింద ఉన్న తాచుపాము కాటు వేసింది. మధ్యరాత్రి సమయంలో మనీశ్‌కు మాట రాకపోవడంతో భయాందోళను గురైన కుటుంబ సభ్యులు వెంటనే భువనగిరి ఆస్పత్రికి తరలించారు. చేతికి గాటు ఉండటంతో పాముకాటుకు గురైనట్లు వైద్యులు గుర్తించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఇరుగుపొరుగు వారు మనీశ్ ఇంట్లోకి వెళ్లి బియ్యం బస్తాలను తొలగించి చూడగా బుసలు కొడుతూ తాచుపాము కనిపించింది. దాన్ని వారు కొట్టి చంపారు. మనీశ్ తండ్రి సిద్ధులు రెండేండ్ల క్రితం తాటిచెట్టు పైనుంచి పడి మృతిచెందాడు. ఇప్పుడు ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందాడని మనీశ్ తల్లి భాగ్యమ్మ కన్నీరు మున్నీరుగా విలపించింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

ఆత్మకూరు(ఎం) : మండలంలోని కూరెళ్ల గ్రామానికి చెందిన ముత్యాల కృష్ణ (52) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కృష్ణ గురువారం భువనగిరి నుం